క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేపట్టి, పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

లారీ డ్రైవర్‌పై దాడి



ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు రహదారిలో సోమవారం మున్సిపల్ రుసుము చెల్లించాలని కోరుతూ లారీ డ్రైవర్‌పై కాంట్రాక్టర్ దాడి చేశాడు. డ్రైవర్ బాలచంద్రుడు, క్లీనర్ పరశురామ్, లారీ అసోసియేషన్ నాయకులు తెలిపిన వివరాలు.. సోమవారం గ్రానైట్ లోడుతో వస్తున్న లారీని వినోద్ అనే మున్సిపల్ కాంట్రాక్టర్ అడ్డుకుని పన్ను చెల్లించాలని కోరాడు. అయితే తమకు సంబంధం లేదని ట్రేడర్స్ వారే రుసుము చెల్లిస్తారని డ్రైవర్ బదులిచ్చాడు. కచ్చితంగా రుసుము చెల్లించాలని డ్రైవర్ పరశురామ్‌పై వినోద్ దాడి చేయడంతో బాధితుడు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న అధికారులు

ఆదోని అర్బన్: ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను బాక్సుల్లో సమకూర్చారు. ఈనెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఆయా బాక్సుల్లో ప్రశ్న పత్రాలను సమకూర్చి పోలీసులకు అప్పగించారు.

వ్యక్తిపై కేసు నమోదు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ శివారులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా జాలమంచి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి అనే వ్యక్తి ఆర్వో ప్లాంట్ పైపు లైన్‌ను ధ్వంసం చేశాడు. దీనిపై సోమవారం ప్రిన్సిపాల్ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు మాధవరం పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు.



ఆదోనిలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, దివ్యాంగుడు, కోసిగిలో చంటి బిడ్డను ఎత్తుకుని వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు, కౌతాళంలో ఓటు వేసేందుకు క్యూలో వేచిఉన్న పట్టభద్రులు

పోటెత్తిన ఓటర్లు

- ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీఎన్నికలు
- స్థానిక సంస్థల ఓటింగ్ 98 శాతం
- పట్టభద్రుల ఓటింగ్ 72 శాతం, టీచర్ల ఓటింగ్ 92 శాతం
- పకడ్బందీగా ఏర్పాట్లు



ఆదోనిలో స్థానిక సంస్థల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ఆదోని రూరల్/ఆదోని అర్బన్: పశ్చిమ రాయలసీమ జిల్లాలు కడప, కర్నూలు, అనంతపురానికి సంబంధించి జరిగిన పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికలు సోమవారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిశాయి. రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు మధ్య పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించారు. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆదోని డివిజన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సరళి

ఆదోని డివిజన్‌లో రెండు మున్సిపాలిటీలు, తొమ్మిది మండలాలకు సంబంధించి ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, తొమ్మిది మంది జెడ్పీటీసీలు, తొమ్మిది మంది ఎంపీపీలతో పాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో కలిపి మొత్తం 259 మంది ఓటర్లకు గాను 254 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 98 శాతం ఓటింగ్ జరిగిందని ఎన్నికల అధికారులు తెలిపారు. వీరికి ఆదోని సబ్ డివిజన్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, జెడ్పీటీసీ అరుణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతతో పాటు ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పట్టభద్రులు, టీచర్ల ఓటింగ్ సరళి

పట్టణంలోని మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో పట్టభద్రులు, టీచర్ల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రులకు ఆరు కేంద్రాలు, టీచర్లకు ఒక కేంద్రంలో ఓటింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం పట్టభద్రులు 6,064 మంది ఉండగా 4359 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 72 శాతం ఓటింగ్ నమోదైంది. 519 మంది ఉపాధ్యాయులకు గానూ 477 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 92 శాతం ఓటింగ్ పూర్తయ్యింది.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఎన్నికల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రశాంతంగా నిర్వహించారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు ఎన్నికలు జరిపారు. అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్‌పాటిల్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఆయనకు పూర్తి సహకారం అందించారు.



ఆదోనిలో ఓటు వేసేందుకు వరుసలో నిల్చున్న ఎంపీటీసీలు, కౌన్సిలర్లు

పగడ్బందీగా పోలీస్ బందోబస్తు

ఆదోని నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీగా పోలీసులు విధి నిర్వహణ చేశారు. అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్‌పాటిల్, డీఎస్పీలు వినోద్‌కుమార్, కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

రెండు గంటలు ఆలస్యంగా ముగిసిన పట్టభద్రుల ఓటింగ్

పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ 242లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పోలింగ్ ఆలస్యంగా ముగిసింది. సిబ్బంది కొరతతో పోలింగ్ ప్రక్రియ నత్తనడకన సాగడంతో సాయంత్రం 4 గంటలకు ముగియాల్సిన ఓటింగ్ సాయంత్రం 6.30 గంటలకు ముగిసింది. దీంతో ఓటర్లు క్యూలో నిలబడి అసహనం వ్యక్తం చేశారు.

సజావుగా పోలింగ్

- మంత్రాలయం నియోజకవర్గంలో 86.39 శాతం పోలింగ్
- ఉపాధ్యాయుల ఓటింగ్ శాతం 96.11 నమోదు



మంత్రాలయంలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

మంత్రాలయం: ఆసక్తికరంగా మారిన శాసన మండలి ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటెత్తారు. ఎండలను సైతం లెక్కచేయకుండా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం పట్టభద్రులు 2,778మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,339, స్త్రీలు 439 మంది ఉన్నారు. అందులో పురుషులు 2,020 మంది, స్త్రీలు 385 మంది ఓటు వేశారు. ఉపాధ్యాయులు మొత్తం 68 మంది కాగా పురుషులు 53 మంది, 15 మంది స్త్రీలు ఉన్నారు. అందులో పురుషులు 52, స్త్రీలు 12 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం పట్టభద్రులు 86.39 శాతం, ఉపాధ్యాయులు 96.11 శాతం మంది ఓట్లు వేశారు. పట్టభద్రులకు సంబంధించి కోసిగి మండలంలో అత్యధికంగా 89.71 శాతం, మంత్రాలయం మండలంలో 82.58 శాతం పోలింగ్ నమోదైంది.

ప్రశాంతంగా పోలింగ్

నియోజకవర్గంలో ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సరళి ముగిసింది. 8 గంటల నుంచి 10 గంటల వరకు ఓటింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు నిర్విరామంగా పోలింగ్ సాగింది. మంత్రాలయంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. మిగతా మండలాల్లో ఆయా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో పర్యవేక్షణ కానిచ్చారు. మంత్రాలయం, పెద్దకడబూరు బ్యాలెట్ బాక్సులను ఒకే రూట్లో ఆదోనికి తరలించారు. కోసిగి, కౌతాళం బాక్సులను వేర్వేరు దారుల్లో చేర్చారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి అనూషరెడ్డి మంత్రాలయంలో పట్టభద్రుల బూత్ 253లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వై.సీ తారామిరెడ్డి, మండల కన్వీనర్ భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య ఎన్నికల సరళిని పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల వివరాలు

మండలం	పట్టభద్రులు		ఓటుహక్కు వినియోగం		పోలింగ్	ఉపాధ్యాయులు		ఓటు వినియోగం		పోలింగ్
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	శాతం	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	శాతం
పెద్దకడబూరు	473	115	402	110	87.07	08	--	08	--	100
కౌతాళం	637	103	551	87	86.21	08	01	08	01	100
మంత్రాలయం	539	104	442	89	82.58	15	11	15	08	88.46
కోసిగి	690	117	625	99	89.71	22	03	21	03	96.00
మొత్తం	2,339	439	2,020	385	86.39	53	15	52	12	96.11



శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్న కర్ణాటక భక్తులు



భక్తులకు అన్నదానం చేస్తున్న గ్రామస్తులు

భక్తి పారవశ్యం

- గ్రామగ్రామాన కన్నడ భక్తులకు ఉచిత సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పాదయాత్ర భక్తాదులు

కోసిగి: ఉగాది పండుగ సందర్భంగా కర్ణాటక భక్తాదులు కోసిగి మీదుగా శ్రీశైలంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామివారి దర్శనార్థం పాదయాత్ర కొనసాగిస్తున్నారు. ఉగాది సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలో బాగల్ కోట్, దార్వాడ, కొప్పల్, మస్కి, సింధనూరు, మాన్వి, శిరుగుప్ప, తదితర ప్రాంతాల నుంచి రోజూ వేలాది మంది భక్తులు దాదాపు 500 నుంచి 700 కిలో మీటర్లు పాదయాత్రగా తరలివెళ్లి శ్రీశైల మల్లన్నను దర్శించుకుంటారు. ప్రస్తుతం మండుటెండలను లెక్క చేయక మహిళలు, యువకులు, పెద్దలు కాలినడక సాగిస్తున్నారు. కొందరు భక్తాదులు కాళ్లకు రెండు నుంచి నాలుగు అడుగులు ఉన్న కర్రలు కట్టుకుని, మరికొందరు పల్లకీ మోసుకుంటూ తరలి వెళుతున్నారు. భక్తుల సౌకర్యార్థం కోసిగిలో చైతన్య పబ్లిక్ స్కూల్ పక్కన బుట్టారేణుక ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం, తాగునీరు, సేద తీరేందుకు వసతులు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం సాయంకాలం వేళల్లో మహిళలు రోడ్డు పక్కన రొట్టెలు తయారు చేసి వడ్డించారు. దీంతో కర్ణాటక భక్తులు సేవలందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఆర్లబండ, కొల్మాన్‌పేట, దుద్ది, కోసిగిలోని కుర్ది చిన్న నాగరాజు కాంప్లెక్స్, రంగప్ప గట్టు, డి.బెళగల్ గ్రామాల్లో ఉచితంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

మూడు గడ్డివాములు దగ్ధం



మంటల్లో దగ్ధమైన గడ్డివాములు

చిప్పగిరి: ప్రమాదవశాత్తు 3 గడ్డివాములకు నిప్పంటుకుని దగ్ధం కావడంతో రూ.1.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన చిప్పగిరిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే.. చిప్పగిరికి చెందిన హరిజన మనోహర్, హరిజన బాలు పశుగ్రాసం కోసం కల్లందొడ్డిలో గడ్డివాములు వేసుకున్నారు. సోమవారం గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈలోపు గడ్డివాములు మూడు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. తహసీల్దారు లక్ష్మీనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నష్టం అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. వీఆర్‌ఓ తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

సెబ్ విస్తృత దాడులు

- సారా ఊట ధ్వంసం- కర్ణాటక మద్యం స్వాధీనం
- ఐదుగురి అరెస్ట్

వెల్దుర్తి: మండల పరిధిలోని సిద్దినగట్టు, బోయనపల్లెలో సోమవారం కోడుమూరు సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. వెల్దుర్తి పోలీసులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన దాడులలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల నాటుసారా, కర్ణాటక మద్యం 62 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు గ్రామాలకు చెందిన నిందితులు ఐదుగురిని అరెస్ట్ చేసి జోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సెబ్ సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు.

గురజాల వాసి దుర్మరణం

నందవరం: రోడ్డు ప్రమాదంలో గురజాల గ్రామానికి చెందిన కురువ రామాంజినేయులు(36) మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఎరిగెర గ్రామ సమీపంలో మోటారు సైకిల్ కిందపడి రామాంజినేయులు, మామ జయరాముడు గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడ్డ రామాంజినేయులు రాయచూరు ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. సోమవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా స్వగ్రామంలోఅంత్యక్రియలు నిర్వహించారు.

మిర్చి రైతు 'ధర'హాసం

- సిరులు కురిపిస్తున్న బ్యాడిగి రకం
- సీడ్ మిర్చికి సైతం మంచి ధర
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మిర్చి దిగుబడులను ఆరబెట్టిన దృశ్యం

కౌతాళం: మండలంలో ఈ ఏడాది అధిక వర్షాలతో రైతులు సాగు చేసిన పంటలు అనుకున్నంత స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో రైతులు వలస బాట పడుతున్నారు. సాగు చేసిన కొన్ని పంటల్లో కూడా దిగుబడులు రాక, దిగుబడులు వచ్చినా మద్దతు ధరలు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. అయితే మండలంలో 15 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగైన మిరప పంట వల్ల కొందరు రైతులు అప్పుల ఊబి నుంచి గట్టెక్కుతున్నారు. తుంగభద్ర దిగువ కాలువ, బోర్ల కింద మిర్చి సాగు చేసిన రైతులు పంటను కంటికి రెప్పలా కాపాడుకోవడంతో పంట స్వరూపమే మారిపోయింది. దీనికతోడు ఫిబ్రవరి నుంచి మంచి ధరలు పలుకుతుండడం, మార్చిలో ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు వచ్చినా ప్రస్తుతం ధర వల్ల తమకు లాభాలు వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మిర్చి సీడ్ రకం క్వింటాల్ రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు, బ్యాడిగి రకం క్వింటాల్ రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఉండేది. ఈ సంవత్సరం సీడ్ రకం క్వింటాల్ రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు, బ్యాడిగి రకం రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు రేటు పలుకుతోంది. దీంతో మిరప రైతుల ఆనందానికి అడ్డే లేకుండాపోయింది. అయితే మిరప దిగుబడులను విక్రయించేందుకు గుంటూరు, కర్ణాటకలోని బ్యాడిగి, సింధనూరు మార్కెట్లకు వెళ్లాల్సి వస్తోంది.

మండలాల వారీగా మిర్చి సాగు వివరాలు

కౌతాళం	- 15 వేల ఎకరాలు
కోసిగి	- 2,900 ఎకరాలు
పెద్దకడబూరు	- 8,530 ఎకరాలు
మంత్రాలయం	- 1200 ఎకరాలు

రూ.5.50 లక్షలు మిగిలాయి



ఉన్న ఎకరంపావు పొలంలో మిరప పంట సాగుచేశాను. ఖర్చులు పోను ఇప్పటివరకు రూ.5.5 లక్షలు మిగిలాయి. గురువారం కర్ణాటక రాష్ట్రం బ్యాడిగి మార్కెట్‌కు మిరప తీసుకుని పోగా 9 క్వింటాళ్లు రూ.58 వేల ప్రకారం, రెండవ రకం 4 క్వింటాళ్లు రూ.40 వేల ప్రకారం అమ్ముడు పోయింది. ఇంకా పొలంలో పంట ఉంది. మరో ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాను. ఈ ఏడాది అప్పులన్నీ తీరిపోయి ఆదాయం మిగులుతుంది.

– భాజ బండెనవాజ్, రైతు, బదినేహాల్

క్వింటాలు రూ.56 వేలు పలికింది



గత రెండేళ్లుగా పండించిన పంటలకు సరైన మద్దతు ధర లేక అప్పుల పాలయ్యాను. ప్రస్తుతం ఐదెకరాల్లో బ్యాగిడి రకం మిర్చి సాగు చేశాను. గతవారం 40 క్వింటాళ్ల దిగుబడులను మార్కెట్‌కు తీసుకు పోగా క్వింటాలు రూ. 56 వేలు పలికింది. పొలం కౌలు, పెట్టుబడి ఖర్చులు పది లక్షలు పోను పది లక్షలు మిగులుతాయి. మంచి ధర పలకడంతో అక్కడి వ్యాపారస్తులు శాలువా, పూలమాలతో సన్మానించడం మరువలేను.

– వెంకటరావు అలియాస్ అనకొండ, రైతు, బదినేహాల్

30 క్వింటాళ్ల దిగుబడి రావొచ్చు



ఉన్న రెండున్నర ఎకరాల్లో బ్యాడిగి రకం, ఒకటిన్నర ఎకరంలో పటాస్ రకం మిర్చి సాగు చేశాను. ఇవి రెండు కలిపి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నమ్మకం ఉంది. ఇదే ధర ఉంటే రూ.5 లక్షల వరకు లాభం వస్తుంది. ఇంకా పంటను తీయలేదు. మరో వారం రోజుల్లో పంట కోతకు వస్తుంది. మంచి ధర ఉండడంతో ఇప్పుడే అమ్ముకోవాలనుకుంటున్నా.

– మహబూబ్‌బాషా, రైతు